సాక్షి
తూర్పుగోదావరి
గురువారం । 3 । జూలై । 2025



ఆలయ అభివృద్ధికి విరాళం


మలికిపురం: స్థానిక అయ్యప్పస్వామి ఆలయ అభివృద్ధికి పులపర్తి సుబ్బారావు, జయలక్ష్మి దంపతులు (టేకిశెట్టిపాలెం) బుధవారం రూ.1.70 లక్షలు విరాళంగా ఇచ్చారు.



పేపర్‌మిల్‌లో గ్యాస్ లీకేజీ కలకలం

ఆంధ్రపేపర్ మిల్లులో గ్యాస్ లీకేజీ కలకలం సృష్టించింది. పేపర్ మిల్లు నార్త్ గేటు వద్ద ట్యాంకర్ నుంచి గ్యాస్ లీక్ అవుతుండటంతో పరిసర ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందారు. -8లో-

మిగులు జలాలు సముద్రంలోకి..



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి బుధవారం 1,03,206 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. ఖరీఫ్ సాగుకు సంబంధించి గోదావరి డెల్టా కాలువలకు 12,150 క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యారేజీ వద్ద 10.90 నీటిమట్టం అడుగులు ఉంది.

తడబడిన తొలి అడుగు!

- 'సుపరిపాలనలో తొలి అడుగు.. ఇంటింటికీ టీడీపీ'పై ఎమ్మెల్యేలు, నేతల్లో అంతర్మథనం
- కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా అమలు కాని హామీలు
- అందరికీ అందని తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్లు
- ప్రతి ఇంటికీ వెళ్తే ప్రజలు నిలదీస్తారని నేతల్లో ఆందోళన
- టీడీపీకి సహకరించని జనసేన, బీజేపీ
- తమకు ఆదేశాలు రాలేదంటూ కార్యక్రమానికి డుమ్మా
- కొన్ని నియోజకవర్గాల్లో అందుబాటులో లేని టీడీపీ ఇన్‌చార్జులు



సాక్షి, రాజమహేంద్రవరం: అధికారం చేజిక్కించుకుని ఏడాది పూర్తయిన సందర్భంగా 'సుపరిపాలనలో తొలి అడుగు– ఇంటింటికీ టీడీపీ' పేరుతో టీడీపీ ప్రజా ప్రతినిధులు ప్రతి ఇంటికీ వెళ్లే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ మేరకు సీఎం చంద్రబాబు నాయుడు స్వయంగా ప్రకటించారు. బుధవారం నుంచి ప్రతి ఎమ్మెల్యే, పార్టీ ఇన్‌చార్జిలు పర్యటించాలని ఆదేశించారు. కానీ జిల్లాలో మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ప్రజల వద్దకు వెళ్లలేక.. వెళితే నిలదీస్తారెమో అన్న ఆందోళన మీమాంస ఆ పార్టీ ప్రజా ప్రతినిధుల్లో నెలకొంది. తాము ప్రజలకు ఏం చేశామని ప్రతి ఇంటికీ వెళ్లి చెప్పాలన్న అంతర్మథనం టీడీపీ ఎమ్మెల్యేలు, నేతల్లో జరుగుతోంది. వెరసి తొలి రోజు తూర్పుగోదావరి జిల్లాలో సుపరిపాలనలో తొలి అడుగే తడబడింది.

నేతల్లో అంతర్మథనం

సార్వత్రిక ఎన్నికల అనంతరం సింహభాగం ఎమ్మెల్యే, టీడీపీ ప్రజా ప్రతినిధులు ప్రజలకు దూరంగా ఉంటూ వచ్చారు. ఏడాది కాలంలో పల్లెలకు వెళ్లిన సందర్భాలు సైతం తక్కువే. అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనకుండా మిన్నకుండిపోవడం పరిపాటిగా మారింది. గ్రామీణ ప్రాంత ప్రజల సమస్యలపై దృష్టి సారించిన దాఖలాలు లేవు. అధికార అండతో అడ్డగోలు వ్యవహారాలకు తెరలేపారు. అక్రమాల దిశగా అడుగులు వేశారు. మట్టి, ఇసుక, మద్యం షాపుల్లో అంతా తామై వ్యవహరించారు. ఇసుక అక్రమ రవాణాతో రూ.కోట్లు గడించారు. మద్యం షాపుల్లో మామూళ్ల దండుకుని జేబుల్లో వేసుకునే ప్రక్రియకు నాంది పలికారు. షాడో ఎమ్మెల్యేలు రంగంలోకి దిగి ప్రజలను దోచుకుంటున్నారు. ప్రతి పనికీ ధర నిర్ణయించి మరీ వసూళ్లకు పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఏ మొహం పెట్టుకుని ప్రజల్లోకి వెళ్లాలన్న అంతర్మథనం నెలకొంది. ప్రజలు.. సమస్యలు, హామీల అమలుపై నిలదీస్తే సమాధానం చెప్పలేమన్న ఆందోళన నెలకొంది. జనంలోకి వెళ్లి చివాట్లు తినాల్సి వస్తుందని భావిస్తున్నారు. హామీలు నెరవేర్చాక వెళితే బాగుంటుందన్న భావనలో టీడీపీ నేతలు ఉన్నారు. దీంతో ఇదెక్కడి కార్యక్రమం అంటూ నిట్టూరుస్తున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల హామీలు నెరవేర్చకుండా ఇంటింటికీ వెళ్లడంలో ఇబ్బందులు తప్పవని ఆ పార్టీ నేతలే తలలు పట్టుకుంటున్నారు.

తూతూ మంత్రంగా ఇంటింటికీ టీడీపీ

'సుపరిపాలనలో తొలి అడుగు–ఇంటింటికీ టీడీపీ' పేరుతో టీడీపీ శ్రేణులు బుధవారం ప్రారంభించిన కార్యక్రమం జిల్లాలో తొలి రోజే తూతూ మంత్రంగా జరిగింది. ప్రజలు ఆగ్రహజ్వాలలకు బలవ్వాల్సి వస్తుందన్న ఉద్దేశంతో కొందరు కార్యక్రమమే ప్రారంభించకపోగా.. మరి కొందరు మాత్రం నాలుగిళ్లు తిరిగే వచ్చేశారు. అది కూడా ముందుగానే సమాచారం ఇచ్చి నిలదీయకుండా ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిసింది.

- రాజానగరం నియోజకవర్గంలో టీడీపీలో ప్రస్తుతం నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి, సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్ వర్గాలు ఉన్నాయి. తొలి రోజు ఏ వర్గం కార్యక్రమం నిర్వహించలేదు. వెంకటరమణ చౌదరి తన కార్యాలయంలో పార్టీ నేతలతో సమావేశమై కార్యక్రమ నిర్వహణపై సమాలోచనలు చేయగా.. పెందుర్తి వర్గం మాత్రం ఎలాంటి కార్యక్రమం చేపట్టలేదు.
- నిడదవోలు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బూరుగుపల్లి శేషారావు అందుబాటులో లేకపోవడంతో పట్టణ అధ్యక్షుడు కార్యక్రమం నిర్వహించారు. తాపీగా సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభించారు.
- రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి కార్యక్రమానికి తొలి రోజే డుమ్మా కొట్టారు. బుచ్చయ్య అబ్బాయి గోరంట్ల రవిరామ్ కిరణ్ కొన్ని ఇళ్లు తిరిగి మిన్నకుండిపోయారు.
- రాజమహేంద్రవరం సిటీ, గోపాలపురం నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

జనసేన, బీజేపీ డుమ్మా

ఇంటింటికీ టీడీపీలో జనసేన, బీజేపీ నేతలు కనిపించలేదు. అది కేవలం టీడీపీ కార్యక్రమం అని, తమకు తమ అధిష్టానాల నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని వెల్లడిస్తున్నారు. ఈ పరిణామం రాజకీయ విశ్లేషకులను ఆశ్చర్యానికి గురి చేస్తోంది. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిగా ఏర్పడ్డాయి. మూడు పార్టీల శ్రేణులు కలిసే ఎన్నికల్లో నెగ్గారు. అలాంటప్పుడు టీడీపీ మాత్రం ఒంటరిగా నిర్వహించడం ఏంటన్న ప్రశ్న తలెత్తుతోంది.

సూపర్ సిక్స్ పేరుతో దగా..

ఎన్నికల సమయంలో ఇచ్చిన వందలాది హామీల్లో ఒకటి రెండు మినహా చంద్రబాబు సర్కార్ నెరవేర్చలేదు. అవి కూడా పూర్తి స్థాయిలో అమలు చేయలేదు. ఎన్నికల్లో ఓట్లేయించుకుని గద్దె నెక్కాక వంచించడంపై జనం మండిపడుతున్నారు.

- తల్లికి వందనం పేరుతో ప్రతి విద్యార్థికి రూ.15 వేలు ఇస్తామన్నారు. అందులో కొంతమందికే ఇచ్చారు. జిల్లాలో 1,88,226 మంది విద్యార్థులుండగా.. కేవలం 1,23,779 మందిని మాత్రమే అర్హులుగా గుర్తించి డబ్బు వేశారు. మిగిలిన వారి పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది.
- ఏడాదికి ప్రతి కుటుంబానికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామన్నారు. కేవలం ఒక్కటి మాత్రమే ఇచ్చారు. మిగిలిన రెండూ ఎగ్గొట్టారు. దీనిపై మహిళలు ఆగ్రహంతో ఉన్నారు. తమ ఇంటి వద్దకు వెళితే పరిస్థితేంటన్న ప్రశ్న నేతల్లో ఉత్పన్నమవుతోంది.
- ఉచిత బస్సు ఊసేలేదు, ప్రతి ఇంటికీ ఒక ఉద్యోగం, లేదంటే ప్రతి నెలా రూ.3 వేల నిరుద్యోగ భృతి కోసం 5.9 లక్షల మంది ఎదురుచూస్తున్నారు.
- 18 ఏళ్లు నిండిన మహిళలు ఆడబిడ్డ నిధి రూ.1500 కోసం ఎదురుచూస్తున్నారు.
- ప్రతి రైతుకూ రూ.20 వేల రైతు భరోసా ఇస్తామని బాబు సర్కారు మోసం చేసింది. దీని కోసం 1.33 లక్షల మంది రైతులు ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. పెట్టుబడులకు డబ్బు అవసరం. ఇలాంటి సందర్భంలో ప్రతి ఇంటికీ వెళితే రైతులు నిలదీసే అవకాశం ఉందన్న ఆందోళన నేతల్లో వెల్లడవుతోంది.

న్యూస్‌రీల్

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేసే అన్ని కేటగిరిలకు చెందిన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు 2025కు దరఖాస్తు చేసుకునే పక్రియ ప్రారంభమైందని జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు బుధవారం తెలిపారు. ప్రతిపాదనలు నేషనల్ అవార్డ్స్ టు టీచర్స్.ఎడ్యుకేషన్.గవ్.ఇన్/లాగిన్.ఎస్‌పీఎక్స్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో సమర్పించాలన్నారు. గడువు ఈ నెల 13వ తేదీతో ముగుస్తుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉపాధి ఆధారిత ప్రోత్సాహకం పథకానికి ఆమోదం



రీజనల్ పీఎఫ్ కమిషనర్–2 వెంకటేశ్వర్లు

రాజమహేంద్రవరం రూరల్: భారత ప్రభుత్వం ఉపాధి ఆధారిత ప్రోత్సాహకం(ఈఎల్ఐ) పథకానికి ఆమోదం తెలిపిందని రాజమహేంద్రవరం ప్రాంతీయ ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ(ఈపీఎఫ్ఓ) రీజనల్ పీఎఫ్ కమిషనర్–2 కె.వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం ఆయన పీఎఫ్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. స్థిరమైన ఉపాధి కల్పన, ఆర్థిక చేయూతను ప్రోత్సహించేందుకు ఈఎల్ఐ పథకం రూపొందించారన్నారు. ఈ ఏడాది ఆగస్టు ఒకటి నుంచి 2027 జూలై 31మధ్య సృష్టించిన ఉద్యోగాలకు ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. యజమానుల ప్రోత్సాహక చెల్లింపులు పాన్–లింక్డ్ బ్యాంకు ఖాతాలకు జమ చేస్తామన్నారు.

భీమేశ్వరాలయం నుంచి తలుపులమ్మకు సారె



లోవ తలుపులమ్మ తల్లికి ఆషాఢం సారె సమర్పిస్తున్న ఈఓ దుర్గాభవాని

రామచంద్రపురం రూరల్: ప్రసిద్ధి చెందిన తలుపులమ్మ అమ్మవారికి ద్రాక్షారామ భీమేశ్వరస్వామి దేవస్థానం నుంచి ఆషాఢం సారెను ఆలయ ఈఓ, దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవాని బుధవారం సమర్పించారు. లోవ తలుపులమ్మ తల్లి దేవస్థానం ఈఓ, దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ పెన్మెత్స విశ్వనాథరాజు నేతృత్వంలో ఘనంగా స్వాగతం పలికారు. అమ్మవారికి సారె సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భీమేశ్వరాలయ అర్చకుడు మద్దిరాల రాజ్‌కుమార్‌శర్మ, చండీ పారాయణదారులు జుత్తుక చిన్న, వైదిక సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం అమలులో అలసత్వం వద్దు

రికార్డుల నిర్వహణపై రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుల అసంతృప్తి



కొరిపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఆహార కమిషన్ సభ్యులు

కరప: ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకం అమలులో అలసత్వం వహించవద్దని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు జక్కంపూడి కృష్ణకిరణ్, ఈ.లక్ష్మీరెడ్డి నిర్వాహకులకు హెచ్చరికలు జారీచేశారు. కోడిగుడ్లు ఎక్కువ నిల్వ ఉండటం, విద్యార్థులకు దొడ్డుబియ్యంతో భోజనం పెట్టడం, రికార్డులు సక్రమంగా నిర్వహించకపోవడంపై కమిషన్ సభ్యులు అసంతృప్తి వ్యక్తంచేశారు. బుధవారం వారు మండల అధికారులతో కలసి కరప మండలంలో అంగన్‌వాడీ కేంద్రాలను, హైస్కూలు, రేషన్ షాపులను, ఎంఎల్‌సీ పాయింట్‌ను తనిఖీ చేశారు. కొరిపల్లిలో అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. 3వ, 4వ ఫేజ్‌లో వచ్చిన 140 కోడిగుడ్లు ఎక్కువ ఉండటాన్ని గుర్తించారు. అంగన్‌వాడీ టీచర్‌కు షోకాజ్ నోటీసు జారీచేయాలని సీడీపీఓ వై.లక్ష్మిని ఆదేశించారు. కూరాడ జెడ్పీ హైస్కూల్‌లో దొడ్డు బియ్యంతో మధ్యాహ్న భోజనం పెట్టటం ఏమిటని హెచ్‌ఎం ప్రశ్నించారు. షోకాజ్ నోటీసు జారీచేయాలని ఎంఈఓ కె.బుల్లికృష్ణవేణిని ఆదేశించారు.

గవర్నర్ పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: కాకినాడ జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్శిటీ 11వ స్నాతకోత్సవానికి శుక్రవారం విచ్చేస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కాకినాడ కలెక్టరేట్‌లో గవర్నర్ అబ్దుల్ నజీర్ కాకినాడ పర్యటన సందర్భంగా కలెక్టర్ షణ్మోహన్, కాకినాడ కమిషనర్ భావన, జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనాతో కలిసి వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో మాట్లాడారు. సంబంధిత అధికారులు చేయాల్సిన ఏర్పాట్లపై కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. జేఎన్టీయూ 11వ స్నాతకోత్సవానికి గవర్నర్ నజీర్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారన్నారు. శుక్రవారం మధ్యాహ్నం 12.30 గంటలకు ఆయన జేఎ స్టీయూ అతిథి గృహానికి చేరుకుంటారన్నారు. అక్కడ కొద్దిసేపు విశ్రాంతి తీసుకుని మధ్యాహ్నం 3 గంటలకు సెమినార్ హాల్లో నిర్వహించే స్నాతకోత్సవంలో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధిత అధికారులు పటిష్ట భద్రత ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్శిటీ అధికారులు పాల్గొన్నారు.

పెరిగిన పొగాకు ధర



దేవరపల్లి వేలం కేంద్రంలో జరుగుతున్న పొగాకు వేలం

- కిలో గరిష్ఠ ధర రూ.310
- ఒక్కరోజులో పెరిగిన ధర రూ.10

దేవరపల్లి: మార్కెట్లో పొగాకు ధర పెరిగింది. ధర రోజురోజుకు పెరుగుతోంది. జూన్ 24 వరకు కిలో గరిష్ఠ ధర రూ. 290 ఉండగా, అనంతరం ఈ ధర రోజు రోజుకు పెరుగుతూ రైతుల్లో ఆశలు కల్పిస్తోంది. ముందు ముందు ధర మరింత పెరుగుతుందని రైతులు ఆశిస్తున్నారు. మార్చి 24న పొగాకు బోర్డు రాజమహేంద్రవరం రీజియన్ పరిధిలోని ఐదు వేలం కేంద్రాల్లో పొగాకు కొనుగోళ్లు ప్రారంభించింది. కిలో గరిష్ఠ ప్రారంభ ధర రూ.290 ఉండగా, అప్పటి నుంచి జూన్ 24 వరకు అదే ధర కొనసాగింది. దీంతో ధర గిట్టుబాటు కాక రైతులు ఆందోళన చెందారు. ఈ నెల 25 నుంచి మార్కెట్లో ధర స్వల్పంగా పెరుగుతూ వస్తోంది. జూన్ 24న కిలో గరిష్ఠ ధర రూ. 290 పలకగా, 26న రూ. 291, 26న రూ. 293, 27న రూ. 296, 28న రూ.299, 30న 300, జూలై 1న కిలో గరిష్ఠ ధర రూ.300 పలకగా బుధవారం మార్కెట్లో కిలోకు గరిష్ఠ ధర రూ. 10 పెరిగి రూ.310 చేరుకుకుంది. ఒక్కరోజునే కిలోకు రూ.10 పెరగడంతో రైతులకు ఊరట లభించినట్లయింది. గత ఏడాది కిలో గరిష్ఠ ధర రూ.410 పలికింది. మార్కెట్లో ధర పెరుగుతుండడంతో వేలానికి వస్తున్న బేళ్ల సంఖ్య పెరుగుతోంది. గురువారం వేలానికి ఐదు వేలం కేంద్రాల నుంచి 5,171 బేళ్లు విక్రయానికి రాగా, 3,758 బేళ్లు కొనుగోలు చేశారు. 1,413 బేళ్లు అమ్ముడు పోలేదు. 4.76 లక్షల కిలోల పొగాకు విక్రయం జరిగినట్టు బోర్డు అధికారులు తెలిపారు. కిలో గరిష్ఠ ధర రూ.310, కనిష్ఠ ధర రూ.200, సగటు ధర రూ.275.10 లభించింది. ఇప్పటి వరకు 80 రోజులు వేలం జరిగింది. 16 కంపెనీలు వేలంలో పాల్గొన్నట్టు అధికారులు తెలిపారు.

నేడు వ్యూహలక్ష్మికి మహాభిషేకం



విశేషాలంకరణలో వ్యూహలక్ష్మి అమ్మవారు

సీటీఆర్ఐ: వ్యూహలక్ష్మి అమ్మవారికి గురువారం మహాభిషేకం జరుగుతుందని శ్రీమాన్ చిన్నవెంకన్నబాబు స్వామి అన్నారు. బుధవారం స్థానిక ట్రస్ట్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. గాడాల శ్రీమహాలక్ష్మీ సమేత చిన్న వేంకటేశ్వరస్వామి పీఠంలో ప్రతి ఏడాది ఆషాఢ మాస రెండో గురువారం శ్రీవ్యూహలక్ష్మి అమ్మవారికి ఈ ఒక్కరోజు మాత్రమే విశేష మహాభిషేకం జరుగుతుందన్నారు. భక్తులంతా విచ్చేసి అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని అన్నారు. ఈ గుప్త నవరాత్రుల్లో భాగంగా గురువారం వ్యూహలక్ష్మికి మహాభిషేకం చేయడం వల్ల అమ్మవారి అనుగ్రహంతో అన్ని ఆటంకాలు తొలగి కోరిన కోరికలు నెరవేరుతాయని అనుగ్రహ ప్రద ఫౌండేషన్ అంతర్జాతీయ వైస్ చైర్మన్ సింగంశెట్టి మహితోష్ తెలిపారు. మన గుడి– మనసేవ భారతీయ ఆధ్యాత్మిక సేవా సమితి ఉభయ రాష్ట్రాల చైర్మన్ మతల రమేష్ మాట్లాడుతూ గత సంవత్సరం గుప్త నవరాత్రులకు ఎంతో మంది భక్తులు మన రాష్ట్రం నుంచే కాకుండా తెలంగాణ నుంచి విచ్చేసి అమ్మవారి అనుగ్రహానికి పాత్రులు అయ్యారన్నారు. కార్యక్రమంలో పీఠం వైస్ చైర్మన్ దుర్గా వెంకట హేమావతి తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి రూ.లక్ష విరాళం

సీటీఆర్ఐ: స్థానిక ఆర్యాపురంలోని శ్రీసత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి అదే ప్రాంతానికి చెందిన విశ్రాంత బీఎస్ఎన్ఎల్ ఉద్యోగి ఆకెళ్ల సూర్యసుబ్రహ్మణ్య కామేశ్వరశర్మ రూ.లక్ష విరాళంగా బుధవారం సమర్పించారు. దీనికి సంబంధించిన చెక్కును ఆలయ కార్యనిర్వహణ అధికారి ఆర్.లక్ష్మీబాయికి అందజేశారు. దాతలు విరివిగా విరాళాలు అందజేసి ఆలయాల అభివృద్ధికి, తద్వారా భక్తులకు మెరుగైన సేవలు అందించేందుకు సహకరించడం అభినందనీయమని ఆమె అన్నారు.

రైతు సమస్యలపై సమర శంఖం

- ధాన్యం సొమ్ము ఎప్పుడిస్తారు ?
- మెట్టకు సాగునీరు మాటేమిటి ?
- జెడ్పీ సమావేశంలో గళమెత్తిన సభ్యులు



సభలో రైతుల సమస్యలపై నిలదీస్తున్న ఎమ్మెల్సీ కుడుపూడి



పీడీఎస్ బియ్యాన్ని ప్రభుత్వ గోడౌన్‌లో ఉంచాలని డిమాండ్ చేస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ వేణుగోపాలరావు, చిత్రంలో కలెక్టర్‌లు ప్రశాంతి, షణ్మోహన్, మహేష్‌కుమార్, జెడ్పీ సీఈఓ లక్ష్మణరావు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: నెల దాటినా ధాన్యం సొమ్ము ఇవ్వరు...అదను దాటిపోతున్నా మెట్టలో ఖరీఫ్‌కు సాగునీరు ఇవ్వరు...ప్రభుత్వం పెట్టుబడి సాయం ఇవ్వదు...కానీ రైతులపై భారం మోపుతూ సర్‌చార్జీలతో కలిపి నీటి తీరువా వసూలు చేస్తామంటారు...మెట్ట ప్రాంతంలో ఖరీఫ్ సాగుకు నీరు విడుదలపై స్పష్టత ఇవ్వరు...కోనసీమలో మేజర్ డ్రైన్‌లు పట్టించుకోకుండా ఖరీఫ్ ఎలా ముందుకు సాగేది...అంటూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం వేదికగా ప్రజాప్రతినిధులు ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరిగారు. కాకినాడ జెడ్పీ సమావేశ మందిరంలో చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షతన బుధవారం జరిగిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ప్రధానంగా రైతుల సమస్యలపై సభ్యులు మూకుమ్మడిగా నిలదీసి కూటమి ప్రభుత్వ తీరును ఎండగట్టారు. కోట్లాది రూపాయల ధాన్యం సొమ్ము జమ చేయకుండా తాత్సారం చేస్తున్న ప్రభుత్వ తీరును రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు తప్పుపట్టారు. జెడ్పీటీసీ సభ్యులు కూడా ప్రభుత్వ తీరును మూకుమ్మడిగా నిలదీశారు. ధాన్యం సొమ్ము కోట్లలో బకాయిలున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్టయినా లేదు, 24 గంటల్లో జమచేస్తామని చెప్పిన ప్రభుత్వం మాట తప్పి రైతులను నట్టేట ముంచేసిందని మండిపడ్డారు. ఖరీఫ్ పెట్టుబడుల కోసం రైతులు నానా పాట్లు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంతలో వైఎస్సార్ సీపీ నుంచి కూటమికి ఫిరాయించిన జెడ్పీ వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు కల్పించుకుని ప్రభుత్వంతో చర్చించి పరిష్కారానికి కృషి చేద్దామనడంతో వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు ఒక్కసారిగా అనుబాబుపై విరుచుకుపడ్డారు. పార్టీ ఫిరాయించిన మీకు రైతుల కోసం మాట్లాడే అర్హత లేదంటూ ధ్వజమెత్తారు. ప్రభుత్వానికి రైతులంటే లెక్కలేదంటూ సభ్యులు నినాదాలు చేస్తూ వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు సభ నుంచి వాకౌట్ చేశారు.

నీటి తీరువా వసూలుపై ఆగ్రహం

కొద్దిసేపు సమావేశం బయట నిరసన వ్యక్తం చేసిన అనంతరం తిరిగి సభకు వచ్చారు. ఖరీఫ్ సాగుకు సమాయత్తమయ్యే తరుణంలో ప్రభుత్వం ఇస్తామన్న పెట్టుబడి ఇవ్వకపోగా నీటితీరువా వసూలు చేయడం అన్యాయమంటూ గొల్లప్రోలు, ప్రత్తిపాడు జెడ్పీటీసీ సభ్యులు ఉలవకాయల లోవరాజు, బెహరా రాజరాజేశ్వరి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖరీఫ్‌లో పెట్టుబడులు లేక రైతులు నానా ఇబ్బందులు పడుతుంటే అన్యాయంగా సర్‌చార్జీలతో కలిపి నీటితీరువా ఎలా వసూలు చేస్తారని సభ్యులు ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి కల్పించుకుని సర్‌చార్జీలు వసూలు చేసే ఆలోచన లేదన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నీటితీరువా కచ్చితంగా వసూలు చేయడం తప్పదన్నారు. రైతులకు సంబంధించి ప్రాధాన్యం కలిగిన ఈ అంశంపై కూటమి ప్రజాప్రతినిధులు పెదవి విప్పకుండా మిన్నకుండి పోవడం ఏమిటని పలువురు సభ్యులు విస్మయం వ్యక్తం చేశారు.

ప్రజాధనం వృథా : ఎమ్మెల్సీ తోట

పీడీఎస్ బియ్యాన్ని చేరువలో ఉన్న ఆలమూరు, రామచంద్రపురంలోని గోడౌన్లలో కాకుండా ద్వారపూడిలోని ప్రైవేట్ గోడౌన్‌లో నిల్వచేయడం ద్వారా ప్రజాధనం వృథా అవుతోందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సభ దృష్టికి తెచ్చారు. ఇరిగేషన్ అధికారులు ఖరీఫ్ సాగునీటి ప్రణాళికను వివరిస్తూ గోదావరి మూడు డెల్టాల పరిధిలో 10.13 లక్షల ఎకరాలకు జూన్ ఒకటిన నీరు విడుదల చేశామన్నారు. గోదావరి డెల్టాలకు విడుదల చేసినట్లే, మెట్ట ప్రాంతంలోని ఏలేరు, భూపతిపాలెం, ముసురుమిల్లి ప్రాజెక్టులు, పుష్కర, పురుషోత్తపట్నం లిఫ్ట్‌ల కింద ఉన్న 2 లక్షల ఎకరాల ఆయకట్టు కూడా జూన్ 1 నుంచి ఎందుకు నీరు విడుదల చేయలేదని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ నిలదీశారు. ఇరిగేషన్ అధికారుల మధ్య సమన్వయం లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాలువలలో మానవ విసర్జితాలను వదులుతున్నా ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారయణరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. జూన్–1 నాటికి పురుషోత్తపట్నం వద్ద కనీస నీటి మట్టం స్థాయి 14 అడుగులకు దిగువకు ఉన్నందున ఎత్తిపోతల ద్వారా మెట్ట ప్రాంతానికి నీటి విడుదల సాధ్య పడలేదని కాకినాడ కలెక్టర్ షణ్మోహన్ వివరణ ఇచ్చారు. ప్రస్తుతం 14.5 అడుగుల స్థాయికి జలాలు ఉన్నందున పుష్కర ద్వారా గురువారం నుంచి నీటి సరఫరా జరుగుతుందని, మిగిలిన మెట్ట ప్రాంత ప్రాజెక్టుల ద్వారా జూలై 15 నుంచి నీరు విడుదల చేస్తామన్నారు. పారిశ్రామిక కాలుష్యాలతో తుల్యభాగ నీరు విషతుల్యమవుతోందని ఎమ్మెల్సీ సోము వీర్రాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. తుల్యభాగ కాలుష్యంపై కాలుష్య నియంత్రణ మండలి పరిశీలించి చర్యలు తీసుకుంటుందని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. కోనసీమలో కూనవరం డ్రైన్ వెంబడి చల్లపల్లి –చింతలపూడి లాకుల వరకూ ఉప్పునీరు వెనుకకు తన్నుకు రావడంతో వందలాది ఎకరాల్లో సేద్యం దెబ్బతింటోందని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ సభ దృష్టికి తెచ్చారు. దీనిపై కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ కల్పించుకుని పరిశీలించి చర్యలు తీసుకుంటానని చెప్పారు.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సాగునీటి కాలువలు, డ్రైన్ల ఆధునీకరణ, డ్రైనేజీ బోర్డు ఏర్పాటుకు చైర్‌పర్సన్ వేణుగోపాలరావు ప్రతిపాదించిన తీర్మానాన్ని సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. ఒకే ఆధార్ నంబర్‌తో మూడు కరెంటు మీటర్లు ఉండటంతో తల్లికి వందనం మంజూరు కాకపోవడం తగదని, గ్రామ పంచాయతీలకు 2023 నుంచి స్టాంపు డ్యూటీ జమ చేయాలని, ధాన్యం సొమ్ము సత్వరం చెల్లించాలని, గ్రామాల్లో పారిశుధ్య పరిరక్షణతో సీజనల్ వ్యాధులను నివారించాలని, మండలాల్లో చేసిన పనులకు చెల్లింపులు చేపట్టాలని జెడ్పీటీసీలు విజ్ఞప్తి చేశారు. రంపచోడవరం మన్యం ప్రాంతంలో రహదారులు అధ్వానంగా మారాయని, అభివృద్ధి పనులు నిలిచిపోయాయని ఎమ్మెల్సీ అనంతబాబు సభ దృష్టికి తీసుకువచ్చారు.

ఉమ్మడి తూర్పుగోదావరిలో సాగునీరు, డ్రైనేజీ వ్యవస్థల ఆధునీకరణకు, డ్రైనేజీ బోర్డు పునరుద్ధరణకు ప్రభుత్వాన్ని కోరుతూ సర్వసభ్య సమావేశం తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది. తొలుత రాజోలు ఎంపీపీ అధ్యక్షుడు కేతా శ్రీనివాసరావు ఆకస్మిక మృతికి సమావేశం రెండు నిమిషాలు మౌనం పాటించింది. కాకినాడ జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ మనీషా, జెడ్పీ సీఈఓ వీవీవీఎస్ లక్ష్మణరావు పాల్గొన్నారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	18,000 – 18,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	27,500
గటగట (వెయ్యి)	25,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	26,500
గటగట (వెయ్యి)	24,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	17,000 – 17,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	18,000 – 18,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

క్లుప్తంగా

బిల్లుల చెల్లింపులకు నిధులివ్వండి

కాంట్రాక్టర్ల వినతి



బిల్లులు చెల్లించాలని కోరుతూ జెడ్పీ వైస్ చైర్మన్ అనుబాబుకు వినతిపత్రం ఇస్తున్న కాంట్రాక్టర్లు

కాకినాడ సిటీ: జిల్లా పరిషత్ గ్రాంట్లతో చేసిన పనుల బిల్లులు తక్షణమే చెల్లించాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం డివిజన్ కాంట్రాక్టర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కాకినాడలో జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి హాజరైన జెడ్పీ వైస్ చైర్మన్ అనుబాబు, కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్‌కుమార్‌కు వినతిపత్రాలు అందజేశారు. మూడేళ్లుగా జిల్లా పరిషత్ నుంచి వచ్చిన గ్రాంట్లతో అన్ని పనులు పూర్తి చేసినా బిల్లులు విడుదల చేయలేదన్నారు. పెండింగ్ బిల్లులు సత్వరమే మంజూరు చేయాలని కాంట్రాక్టర్లు కోరారు.

శతాధిక వృద్ధురాలు కన్నుమూత



చింతా సీతమ్మ (ఫైల్)

దేవరపల్లి: మండలంలోని యర్నగూడెం గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు చింతా సీతమ్మ(108) బుధవారం కన్నుమూశారు. ఇంత వయసులోనూ ఎటువంటి అనారోగ్యానికి గురి కాకుండా, చలాకీగా తిరిగేదని కుటుంబ సభ్యులు తెలిపారు. మంగళవారం వృద్ధాప్య పింఛను తీసుకున్న సీతమ్మ ఇంటి వద్ద హఠాత్తుగా మరణించినట్టు చెప్పారు. ఆమెకు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

అన్నదాత ఇంట.. సిరుల పంట

- ఖరీఫ్ సీజన్‌లో వెదజల్లుపై రైతుల ఆసక్తి
- పెట్టుబడి ఆదా.. అధిక దిగుబడి
- డ్రమ్ సీడర్ పద్ధతితో మరింత మేలు



పెనికేరులో వెదజల్లు సాగు చేపట్టిన పొలంలో విత్తనాలు చల్లుతున్న రైతులు



పెదపళ్లలో చేపట్టిన వెదజల్లు సాగులో మొలకెత్తిన విత్తనాలు

ఆలమూరు: వ్యవసాయంలో అధిక పెట్టుబడిని, కూలీల కొరతను ఎదుర్కొనేందుకు రైతులు అనేక అధునాతన పద్ధతులను అవలంబిస్తున్నారు. దీంతో వరి సాగులో ఏటా అనేక మార్పులు సంభవిస్తూ, వ్యవసాయం కొత్త పుంతలు తొక్కుతుంది. అత్యాధునిక, పురాతన సంప్రదాయాలతో వ్యవసాయం చేపట్టడం ద్వారా రైతులు పెట్టుబడిని నియంత్రించుకుని అధిక దిగుబడులు సాధిస్తున్నారు. ఈ ఏడాది రబీ సీజన్‌లో దిగుబడి ఆశాజనకంగా ఉన్నా, సరైన గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు కొంత నిరుత్సాహంగా ఉన్నారు. ఈ సీజన్‌లో ధాన్యం సొమ్మును రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేయకపోయినా, అన్నదాత సుఖీభవ అమలు చేయకపోయినా రైతులు మాత్రం ఖరీఫ్ సీజన్‌లో నిమగ్నమయ్యారు. ఇప్పటికే పెరిగిన ఎరువుల ధరలు, కూలీల కొరత వల్ల పెట్టుబడిని తగ్గించుకునేందుకు ఈసారి అధికంగా రైతులు వినూత్న రీతిలో వెదజల్లు సాగు చేపట్టారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్‌లో 1.64 లక్షల ఎకరాల్లో 1.06 లక్షల మంది రైతులు వ రిసాగు చేపట్టారు. స్వర్ణ (7029)కు ప్రత్యామ్నాయంగా ఎంటీయూ (1318), ఎంటీయూ (1121) రకాలు వినియోగించాలని వ్యవసాయ శాఖ సూచించింది. ఈ కొత్త వంగడాల వల్ల నారుమడులు సరైన రీతిలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే, చీడపీడలు నివారించి నష్ట నివారణను అరికట్టవచ్చునని అధికారులు చెబుతున్నారు.

స్వర్ణ (7029)కే రైతుల మొగ్గు

రైతులు మాత్రం ఏళ్ల తరబడి సంప్రదాయబద్ధంగా వస్తున్న స్వర్ణ (7029) రకానికి మాత్రమే ప్రాధాన్యమిస్తున్నారు. ఈ సీజన్‌లో 70 శాతం మేర స్వర్ణ రకం సాగు చేస్తుండగా, మిగతా ఇతర రకాలను సాగు చేస్తున్నారు. ఈ ఖరీఫ్ సాగుకు 35 వేల క్వింటాళ్ల విత్తనాలు అవసరమవుతాయని అంచనా వేయగా, రైతుల నుంచి సుమారు మూడు వేల క్వింటాళ్ల సేకరణ ఇప్పటికే జరిగింది. ప్రస్తుతం వివిధ గ్రామాల్లో దాదాపు వెయ్యి క్వింటాళ్ల విత్తనాలు ఆర్ఎస్‌కేలకు సరఫరా చేసేందుకు వ్యవసాయ శాఖ సమాయత్తమవుతోంది. ఈ సీజన్‌లో సుమారు 80 శాతం మేర వెదజల్లు సాగును ఎంచుకోగా, మిగిలిన రైతులు వరినాట్ల పద్ధతిని అవలంబిస్తున్నారు. సాగునీటి ఎద్దడి దృష్ట్యా వ్యవసాయ శాఖ ఈ నెల 15 నాటికి నాట్లు పూర్తి చేయాలని సూచించడంతో, రైతులు పనులను వేగవంతం చేశారు. వ్యవసాయ శాఖ అధికారులు కూడా వెదజల్లు వల్ల లాభాలపై అవగాహన కల్పించడంతో రైతులు ఈ విధానంపై ఎక్కువ ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ ఏడాది విత్తనాలు రైతులకు సమృద్ధిగా అందుబాటులో ఉండటంతో, సమయానికి ముందే రైతులు సాగు చేపట్టారు. డ్రమ్ సీడర్ వినియోగంతో చక్కటి ఫలితాలు వచ్చే అవకాశం ఉన్నా, రైతులకు అంతగా అవగాహన లేకపోవడంతో ఆ దిశగా చర్యలు చేపట్టలేదని అంటున్నారు.

కలుపు యాజమాన్య పద్ధతి

పంట తొలి దశలో నీరు నిలగట్టక ఆరుతడిగా సాగు చేయడం వల్ల కలుపు సమస్య అధికంగా ఉంటుంది. అందువల్ల ఈ పద్ధతిలో కలుపు మందును తప్పనిసరిగా వాడాలి. ఎకరాకు 35 గ్రాముల ఆక్సాడయార్జిల్ లేదా ప్రెటిలాక్లోర్ మందును ఎకరాకు 400 మి.లీ లేదా పైరజో సల్ఫ్యూరాన్ ఇథైల్ 100 గ్రాముల మందును 20 కిలోల పొడి ఇసుకలో కలపాలి. ఈ మందును వెదజల్లు విధానంలో విత్తిన 3–5 రోజుల్లో పొలంలో పలచగా, నీరు పెట్టి కలుపు మందును పిచికారీ చేయాలి. తర్వాత పొలంలో నీరు తీసి వేయడం ద్వారా కలుపును నివారించవచ్చు. రెండో దశ నుంచి పొలంలో ఏర్పడిన కలుపును మొక్కల మధ్య తొక్కడం ద్వారా ఎరువుగా మలచుకోవచ్చు.

పాడి-పంట

నీటి యాజమాన్యం

విత్తనం వేసినప్పటి నుంచి పొట్ట దశ వచ్చే వరకూ పొలంలో నీరు నిల్వ ఉండకుండా కేవలం బురదగా మాత్రమే ఉండేలా చర్యలు తీసుకోవాలి. ఎక్కువైన నీటిని బయటకు పోవడానికి వీలుగా కాలువలు ఏర్పాటు చేసుకోవాలి. దీనివల్ల వరి కంకి వేర్లు ఆరోగ్యంగా పెరిగి, ఎక్కువ పిలకలకు అవకాశం ఉంటుంది. పైరు పొట్ట దశ నుంచి పంట కోసే పది రోజుల ముందు రెండు సెం.మీ. నీరు నిల్వ ఉండేలా చూడాలి.

డ్రమ్ సీడర్ పద్ధతిలో..

దమ్ము చేసిన అనంతరం చదును చేసిన భూమిలో పలచటి నీటి పొర ఉండేలా చూసుకుని, మండి కట్టిన విత్తనాన్ని చల్లాలి. డ్రమ్ సీడర్ పరికరానికి నాలుగు ప్లాస్టిక్ డ్రమ్ములుంటాయి. ప్రతి డ్రమ్ముకు 20 సె.మీ. దూరంలో రెండు చివర్ల వరుసకు 18 రంధ్రాలుంటాయి. ఈ డ్రమ్ములో మొలకెత్తిన విత్తనాలను నింపి మూతను బిగించాలి. గింజలు నింపి, డ్రమ్ సీడర్‌ను లాగితే ఎనిమిది వరుసల్లో 20 సెం.మీ. దూరంలో గింజలు పడతాయి. దీంతో వరుసల్లో కుదురు కుదురుకు మధ్య దూరం 5–8 సెం.మీ. దూరం ఉంటుంది. ప్రతి 16 వరుసలకు అడుగు వెడల్పులో కాలిబాటలు వేసుకోవాలి. తాడు లాగి డ్రమ్ వాడితే వరుసలు బాగా వచ్చి, విత్తు సక్రమంగా ఉంటుంది.

వెదజల్లుతో ప్రయోజనాలు

- తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసి, కూలీల కొరతను అధిగమించవచ్చు.
- సాగునీటి ఎద్దడిని అధిగమించవచ్చు. పంట పది రోజుల ముందే కోతకు వస్తుంది. భూమి సారవంతమవుతుంది.
- మొక్కలో సాంద్రత పెరిగి, పది శాతం మేర అధిక దిగుబడికి అవకాశం ఉంది.
- సాధారణ పద్ధతిలో వరి సాగుకు ఎకరం పొలంలో నారుమడికి 30 కేజీల విత్తనాలు అవసరం. వెదజల్లులో కేవలం 12 నుంచి 18 కేజీలు చాలు.
- కలుపు మొక్కలను సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా ఎరువుగా మలుచుకోవచ్చు.
- నారుమడులు పోసి ఊడ్చేందుకు పట్టే ఎక్కువ సమయాన్ని, వెదజల్లు సాగుతో అరికట్టవచ్చు.
- పెట్టుబడి పరంగా రూ.మూడు వేల వరకూ ఆదా అవుతుంది.
- ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో పంట కాలం కోల్పోకుండా, నీరు అందుబాటులో ఉన్నప్పుడే సాగుకు అవకాశం ఉంటుంది.

కనీస జాగ్రత్తలు కీలకం

- వెదజల్లు సాగు విధానంలో కనీస జాగ్రత్తలు పాటిస్తే మంచి ఫలితాలు ఉంటాయని జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు చెబుతున్నారు.
- వెదజల్లు విధానంలో విత్తనాలను 24 గంటల పాటు నానబెట్టాలి. మరుసటి రోజు ఆ విత్తనాలను గోనె సంచె కప్పి నిల్వ ఉంచాలి. విత్తనం ముక్కు పగిలి తెల్లగా మోసు వచ్చే క్రమంలో పొలంలో విత్తనాలను వెదజల్లాలి.
- విత్తనాలకు మొక్కలు వచ్చే వరకూ పొలంలో నీరు లేకుండా కాలువలు ఏర్పాటు చేసి, నీటిని బయటకు పంపాలి.
- వారం తర్వాత ఒకసారి పంటకు నీరును అందజేసి, మరుసటి రోజు తొలగించాలి.
- దమ్ము చేసే సమయంలో పొలంలో ఎగుడుదిగుడులు లేకుండా నేలను సమాంతరంగా ఉండేలా చూడాలి.
- ఎకరానికి 16 నుంచి 20 కిలోల విత్తనాలను నాటాలి. వరినాట్లు నాటే 15 రోజుల ముందు ఒకసారి దమ్ము చేయాలి.
- నాలుగు రోజుల ముందుగా చదును చేయాలి. ప్రతి రెండు మీటర్లకు 20 సెం.మీ. కాలువలను ఏర్పాటు చేయాలి.
- కలుపు నివారణకు బింతియోకార్బ్ లేదా అనిలోఫాస్ 1.25 లీటర్ల మందును 27 కిలోల ఇసుకలో కలిపి చల్లితే కలుపును నివారించవచ్చు.

పేపర్ మిల్‌లో గ్యాస్ లీకేజీ కలకలం

- 4 గంటలు శ్రమించి నియంత్రించిన అగ్నిమాపక యంత్రాంగం
- భీతిల్లిన పరిసర ప్రాంతాల ప్రజలు



లారీ నుంచి లీక్ అవుతున్న గ్యాస్‌ను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

సాక్షి, రాజమహేంద్రవరం: రాజమండ్రి ఆంధ్రపేపర్ మిల్లులో గ్యాస్ లీకేజీ కలకలం సృష్టించింది. పేపర్ మిల్లు నార్త్ గేటు వద్ద ట్యాంకర్ నుంచి గ్యాస్ లీక్ అవుతుండటంతో పరిసర ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందారు. గత నెల 29వ తేదీన బరోడా నుంచి రాజమండ్రి పేపర్ మిల్‌కు 26 టన్నుల హైడ్రోజన్ పెరాక్సైడ్ లోడులో ఓ ట్యాంకర్ వచ్చింది. ట్యాంకర్‌లోని గ్యాస్‌ను వెంటనే దిగుమతి చేసుకోకపోవడంతో, ట్యాంకర్ అలాగే ఉండిపోయింది. నాలుగు రోజులుగా పేపర్ మిల్ నార్త్ గేటు వద్ద ట్యాంకర్ నిలిపేశారు. బుధవారం ఉదయం నుంచి గ్యాస్ లీక్ కావడంతో ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారమివ్వడంతో వెంటనే సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. నాలుగు ఫైరింజన్లతో గ్యాస్ లీకేజీని అరికట్టే చర్యలు చేపట్టారు. ఘటన స్థలానికి పక్కనే పెట్రోల్ బంక్, పేపర్ మిల్ టింబర్ డిపో ఉండడంతో స్థానికులు భీతిల్లారు. సంఘటన స్థలాన్ని ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్, ఫ్యాక్టరీస్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ కె.కృష్ణమూర్తి, జిల్లా పరిశ్రమల అధికారి వాణిధర్ రామన్ పర్యవేక్షించారు.

వ్యూహాత్మకంగా నియంత్రణ

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): ఉదయం 9.15 నిమిషాలు.. రాజమహేంద్రవరం ఫైర్ ఆఫీసుకు ఫోన్ వచ్చింది. పేపర్ మిల్‌కు వచ్చిన తన లారీ ట్యాంకర్ నుంచి హైడ్రోజన్ పెరాక్సైడ్ లీక్ అవుతుందని చెప్పాడు. క్షణం ఆలస్యం చేయకుండా ఆర్యాపురం ఫైర్ ఆఫీసు నుంచి ఫైరింజిన్ బయలుదేరింది. ట్యాంకర్ నుంచి లీకవుతున్న హైడ్రోజన్ పెరాక్సైడ్ అధిక మొత్తంలో వ్యాపిస్తే, దానిని పీల్చిన వారి ఊపిరితిత్తులు పాడైపోతాయి. శరీరంపై పడితే పెద్ద బొబ్బలు ఏర్పడుతాయి. అప్రమత్తమైన అగ్నిమాపక బృందాలు జిల్లా ఫైర్ ఆఫీసర్ మార్టిన్ లూథర్‌కింగ్ నేతృత్వంలో సంఘటన స్థలంలో నియంత్రణ చర్యలు చేపట్టాయి. రాజమహేంద్రవరం కోటిపల్లి బస్టాండ్ వద్దనున్న ఫైర్ ఆఫీసు నుంచి మరో రెండు, కొవ్వూరు నుంచి ఒక ఫైరింజిన్ సంఘటన స్థలానికి చేరుకున్నాయి. రెస్క్యూ టెండర్ వాహనాన్నీ రప్పించారు. హైడ్రోజన్ పెరాక్సైడ్ లీకేజీతో ప్రజలకు ఏం కాకుండా పోలీసుల సహకారంతో పేపర్ మిల్ ప్రాంతంలో పూర్తిగా రాకపోకలు నిషేధించారు. ట్యాంకర్‌లోని హైడ్రోజన్ పెరాక్సైడ్‌ను పూర్తిగా నిర్వీర్యం చేసేలా అగ్నిమాపక అధికారులు వ్యూహాత్మకంగా వ్యవహరించారు. అగ్నిమాపక సిబ్బంది ప్రత్యేక కెమికల్ సూట్లు, సెపరేట్ డ్రెస్‌ను ధరించారు. ట్యాంకర్‌లో ఉష్ణోగ్రతను తగ్గించేందుకు కూలింగ్ వాటర్, వాయువులను చిమ్మారు. ఆపరేషన్ ప్రారంభించిన ఉదయం 9.30కు 47 డిగ్రీలున్న ఉష్ణోగ్రతను, మధ్యాహ్నం 12 గంటలకు 26 డిగ్రీలకు తగ్గించగలిగారు. లీకవుతున్న హైడ్రోజన్ పెరాక్సైడ్‌పై నీటిని చల్లి, భూమిలోకి ఇంకిపోయేలా చేయడంతో పెను ప్రమాదం తప్పింది. ట్యాంకర్ నుంచి హైడ్రోజన్ పెరాక్సైడ్ పరిసర ప్రాంతాలకు వ్యాపించకుండా చర్యలు చేపట్టిన ఫైరాఫీసర్ శ్రీనివాస్, అగ్నిమాపక సిబ్బందిని అందరూ అభినందించారు.

అనధికార మద్యం అపాయకరం

జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి లావణ్య



రాజమహేంద్రవరం రూరల్: లైసెన్స్ పొందిన రిటైల్ దుకాణాల నుంచి మాత్రమే మద్యం కొనుగోలు చేయాలని జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి చింతాడ లావణ్య ఓ ప్రకటనలో తెలిపారు. అనధికార (లైసెన్స్ లేని) వ్యక్తుల నుంచి మద్యం కొనుగోలు చేయడం చాలా అపాయకరమన్నారు. అటువంటి మద్యం నకిలీది కావచ్చన్నారు. వివాహాలు, పార్టీలు లేదా ఇతర సామూహిక వేడుకల సందర్భాల్లో మద్యాన్ని తగ్గింపు ధరలకు సరఫరా చేస్తామంటూ మోసం చేసే అవకాశం ఉందన్నారు. వారు సరఫరా చేసే నకిలీ మద్యం ఆరోగ్యానికి తీవ్ర హాని కలిగించవచ్చని హెచ్చరించారు. కొన్ని సందర్భాల్లో మరణానికి కూడా దారితీయవచ్చన్నారు. అటువంటి అనుమానిత వ్యక్తుల వివరాలను వెంటనే ఎక్సైజ్ శాఖకు తెలియజేయాలన్నారు. టోల్ ఫ్రీ నంబరు 14405కి కానీ, జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి 96767 14547 నంబర్‌కు కానీ తెలపాలని కోరారు.

కారు ఢీకొని వ్యాపారి మృతి



చంద్రశేఖర్ (ఫైల్)

ఏలేశ్వరం: అతివేగంగా ప్రయాణిస్తున్న కారు ఢీకొనడంతో ఓ వ్యాపారి మృతి చెందిన సంఘటన ఇది. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు, పట్టణానికి చెందిన గూడపాటి నాగసత్య చంద్రశేఖర్(44) పాత ఆంధ్రా బ్యాంక్ ఎదురుగా చెప్పుల షాపు నిర్వహిస్తున్నాడు. షాపు వద్దే అతడి ఇల్లు కూడా ఉంది. షాపు వెనుక భాగంలో భవనాన్ని నిర్మిస్తున్నాడు. ఈ క్రమంలో నల్లరాయి చిప్స్ లారీ వస్తుందని సమాచారం రావడంతో, మంగళవారం అర్ధరాత్రి దాటాక రెండు గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వచ్చాడు. ఆ సమయంలో వర్షం కురుస్తోంది. గొడుగు వేసుకుని.. షాపు ఎదురుగా రోడ్డు దాటుతుండగా, యర్రవరం రోడ్డులో ఏలేశ్వరం వైపు అతివేగంగా వచ్చిన కారు అతడిని ఢీకొంది. ఈ ప్రమాదంలో చంద్రశేఖర్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. సమీపంలోని షాపులో ఉన్న సీసీ కెమెరాలో ప్రమాద సంఘటన రికార్డు అయినట్టు పోలీసులు గుర్తించారు. మృతుడికి భార్య దివ్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రత్తిపాడు ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నవ్వుతూ ఉండే వ్యక్తి

ఎప్పుడూ నవ్వుతూ చలాకీగా ఉండే చంద్రశేఖర్.. రోడ్డు ప్రమాదంలో మృతిచెందడాన్ని అతడి బంధువులు, స్నేహితులు జీర్ణించుకోలేకపోతున్నారు. అతడి మృతితో భార్యాపిల్లలు, తల్లిదండ్రులు తీవ్రంగా విలపిస్తున్నారు. వీరిని ఓదార్చడం బంధువులకు కష్టంగా మారింది.

గుడిలో చోరీ కేసు నిందితుడికి జైలు

పిఠాపురం: ఆలయంలో చోరీ చేసిన కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి నాలుగేళ్ల జైలు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ పిఠాపురం జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎం.విజయరామేశ్వరి బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం, గతేడాది జూలై 22న పట్టపగలు జన సంచారం ఉండే పిఠాపురం రైల్వే స్టేషన్ ఆవరణలోని కనకదుర్గ గుడిలో చోరీ సంఘటన పట్టణంలో కలకలం రేపింది. రైల్వే స్టేషన్ ఆవరణలోని కనకదుర్గ గుడిలో ఆ రోజు మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తి చోరీకి పాల్పడ్డాడు. అమ్మవారి చెవి దిద్దులు, అమ్మవారి బొట్టు, రెండు జతల మంగళ సూత్రాలు, సుమారు 17 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీ చేసినట్టు ఆలయ చైర్మన్ తుబక ఈశ్వరరావు అప్పటి ఎస్సై మురళీమోహన్‌కు ఫిర్యాదు చేశారు. ఎస్సై దర్యాప్తు చేపట్టగా, క్లూస్ టీం సంఘటన స్థలంలో ఆధారాలు సేకరించింది. చోరీ ఘటన అంతా సీసీ కెమెరాలో రికార్డయింది. సీసీ పుటేజీ ఆధారంగా నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. నిందితుడు కిర్లంపూడి మండలం భూపాలపట్నానికి చెందిన తబెశెట్టి శ్రీనుగా గుర్తించారు. నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి, కోర్టులో హాజరుపర్చారు. కోర్టులో విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో నిందితుడికి రెండు సెక్షన్లకు రెండేళ్ల చొప్పున నాలుగేళ్ల జైలు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో రెండు వారాల జైలు శిక్ష అనుభవించాలని, ఆయా శిక్షలు ఏకకాలంలో అనుభవించవచ్చని తీర్పులో పేర్కొన్నారు. ప్రాసిక్యూషన్ తరపున ఎ.లీలా నాగరోజా, జగదీష్ వాదించారు. పట్టణ ఎస్సై మణికుమార్, కోర్టు కానిస్టేబుల్ కరీం సాక్షులను కోర్టులో హాజరుపర్చారు.

వేర్వేరు చోట్ల ఇద్దరి ఆత్మహత్య

కాకినాడ క్రైం: ఆర్థిక ఇబ్బందులు తాళలేక నగరానికి చెందిన ఓ వ్యక్తి బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. టూటౌన్ పోలీసుల వివరాల మేరకు, అచ్యుతాపురం సమీపంలో నివసిస్తున్న నల్లా రాజు(29) ఏసీ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులకు తాళలేక బుధవారం తెల్లవారుజామున ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతడి భార్య అనిత ఉదయం లేచి చూసే సరికి భర్త రాజు విగతజీవిగా కనిపించాడు. బంధువులు కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా, అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. రాజుకు నాలుగేళ్ల క్రితం వివాహమైంది. దంపతులకు రిషిత అనే మూడేళ్ల పాపతో పాటు, 11 నెలల చరణ్‌తేజ్ అనే బాబు ఉన్నాడు. మంగళవారం రాజు తన భార్యతో కలిసి పెళ్లి రోజు వేడుక జరుపుకొన్నారు. అంతలోనే రాజు ఆత్మహత్య చేసుకోవడంతో భార్యతో పాటు, కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. బాబు తొలి పుట్టిన రోజు ఈ నెలాఖరున జరగాల్సి ఉంది. చంటి పిల్లలను చూసిన స్థానికులు తీవ్ర వేదనకు గురయ్యారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రేమ విఫలమైందని..

కాకినాడకు చెందిన ఓ యువకుడు ప్రేమ విఫలమై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గాంధీనగర్‌కు చెందిన దండే షాహిన్ (19) ఓ యువతిని ప్రేమించాడు. తన ప్రేమను తిరస్కరించినందుకు అతడు మనోవేదనకు గురయ్యాడు. ఈ నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లి శాంతకుమారి అతడిని గమనించి కాకినాడ జీజీహెచ్‌కు తరలించినప్పటికీ.. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మోటారు సైకిళ్ల దొంగ అరెస్టు

ఏడు బైక్‌లు స్వాధీనం



మోటారు సైకిళ్లు, నిందితుడితో సర్పవరం పోలీసులు

కాకినాడ రూరల్: వివిధ ప్రాంతాల్లో మోటార్ సైకిళ్లను దొంగిలించిన కేసులో కాకినాడ అర్బన్ కామేశ్వరినగర్ రామకృష్ణారావుపేటకు చెందిన యువకుడు కడియాల ప్రేమ్‌కుమార్ అలియాస్ దుర్గాప్రసాద్ అలియాస్ జిజ్జును సర్పవరం పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. ఎస్సై పి.శ్రీనివాస్‌కుమార్ వివరాల మేరకు, నిందితుడు జిల్లాలోని పలు ప్రాంతాల్లో మోటారు సైకిళ్ల చోరీలకు పాల్పడ్డాడు. అతడిపై నిఘా ఉంచి, అరెస్టు చేశారు. సుమారు రూ.3.5 లక్షల విలువైన ఏడు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని పట్టుకోవడంలో కృషి చేసిన ఎస్సై శ్రీనివాస్‌కుమార్‌తో పాటు, ఏఎస్సైలు శ్రీనివాస్, నాగేశ్వరరావు, హెచ్‌సీలు సత్తిబాబు, రాజు, ప్రసాద్, పీసీలు అనిల్, కిశోర్‌ను సీఐ పెద్దిరాజు అభినందించారు.

డ్రెయిన్‌లో పడి యువకుడి మృతి



నాగరాజు (ఫైల్)

కాజులూరు: మోటార్ బైక్ అదుపు తప్పడంతో స్థానిక టేకి డ్రెయిన్‌లో పడి దాకమూరి నాగరాజు (22) మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసుల వివరాల ప్రకారం కోలంక గ్రామానికి చెందిన దాకమూరి నాగరాజు హైదరాబాద్‌లో ర్యాపిడో సర్వీసులో పనిచేస్తున్నాడు. ఇటీవల గ్రామంలో అమ్మవారి జాతరకు వచ్చాడు. సోమవారం రాత్రి కోలంక నుంచి ద్రాక్షారామ వెళుతుండగా, ఉప్పుమిల్లి శివారు గొప్పిరేవు వద్ద మోటార్ బైక్ అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో నాగరాజు శిథిలమైన రెయిలింగ్ నుంచి టేకి డ్రెయిన్‌లో పడిపోయాడు. మృతదేహం కొట్టుకుపోయి, తాళ్లరేవులో లభ్యమైంది. కాగా, నాగరాజుకు వివాహం కాలేదు. తల్లిదండ్రులు ఉన్నారు. కోలంకలో మృతుని ఇంటి వద్ద విషాదఛాయలు అలుముకున్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్టు గొల్లపాలెం పోలీసులు తెలిపారు. ఎస్సై మోహన్‌కుమార్ దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

కరప: గ్రామానికి చెందిన బాలికను మభ్యపెట్టి, కిడ్నాప్ చేసిన యువకుడిపై పోక్సో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు, రాజస్థాన్ నుంచి కరప గ్రామానికి వచ్చి, ఇక్కడ స్థిరపడిన కుటుంబంలోని ఆ బాలికను, అదే గ్రామానికి చెందిన బుద్దాల మణికంఠ మాయమాటలు చెప్పి గత నెల 8న తీసుకెళ్లిపోయాడు. మరుసటి రోజు తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదుపై కరప పోలీసులు బాలిక అదృశ్యం కేసు నమోదు చేశారు. ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాలతో దర్యాప్తు ముమ్మరం చేసిన పోలీసులు కర్ణాటక రాష్ట్రం బళ్లారిలో బాలికను గుర్తించి, ఆదివారం కరప తీసుకొచ్చారు. బాలిక ఇచ్చిన స్టేట్‌మెంట్ మేరకు మిస్సింగ్ కేసును పోక్సో కేసుగా మార్పు చేశారు. వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం పోలీసులు బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు. కాకినాడ ఏఎస్పీ పాటిల్ దేవరాజ్ మనీష్ పర్యవేక్షణలో నిందితుడిని బుధవారం అరెస్ట్ చేసి, స్పెషల్ జేఎఫ్‌సీఎం ఫర్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కోర్టులో హాజరుపర్చారు. నిందితుడు మణికంఠకు న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్‌కు ఆదేశించినట్టు కరప ఎస్సై టి.సునీత తెలిపారు.